

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత తదితరులు

రోడ్డు పనులు పూర్తి చేయాలి : కార్పొరేటర్ అమృత

నల్లకుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. డివిజన్‌లోని న్యూనల్లకుంట, హనుమాన్ ఆలయం, మెయిన్‌రోడ్డు పనులు గత నెలలోనే ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే ఇటీవల జరిగిన వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, దేవీ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులు నిలిచిపోయాయని ఆమె గుర్తుచేశారు. గురువారం ఆయా ప్రాంతాల్లో కార్పొరేటర్ పాదయాత్ర చేసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఈ నూతన రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు శ్రీనివాస్, స్థానికులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ
- దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 18 చివరి తేదీ



మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ

ముషీరాబాద్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2025-27 సంవత్సర నూతన మద్యంషాపుల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపారు. గురువారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ 21 సంవత్సరాలు నిండిన ఆసక్తి గల అభ్యర్థుల నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తుదారుడు రూ.3లక్షల నాన్ రిఫండబుల్ డీడీని దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. దరఖాస్తులను నాంపల్లిలోని ఎక్సైజ్ భవనంలో అందజేయాలని ఆయన సూచించారు.

చెగువేరా స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాడుదాం

చిక్కడపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ విప్లవకారుడు సామ్రాజ్యవాదానికి సింహస్వప్నం చెగువేరా స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాడుదామని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. చెగువేరా 58వ వర్ధంతి సభ గురువారం చిక్కడపల్లిలోని ఎస్‌ఎఫ్‌ఐ డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీలేని సమాజం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 39 సంవత్సరాలకే చెగువేరా తనువు చాలించాడని అన్నారు. నేడు అమెరికా చిన్నదేశాలైన క్యూబా, వెనిజులాలను అణిచివేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. చెగువేరా స్ఫూర్తితో సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జావేద్, రమేష్, రాజు, విజయ్, విజయ్‌కుమార్, వెంకటేష్, రజనికాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆరోగ్య మానసిక దినోత్సవం

ముషీరాబాద్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో మానసిక ఆరోగ్యం పై అవగాహన పెంచడానికి, ఆరోగ్యకరమైన విద్యను ప్రోత్సహించడానికి, అపోహలను తొలగించడానికి అంకితం చేసిన రోజు ప్రపంచ ఆరోగ్య మానసిక దినోత్సవం అని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక యుగంలో మానసిక ఆరోగ్య సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యంపై సరైన అవగాహన లేకే మానసిక వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. మానసిక సమస్యల నుంచి బయట పడేందుకు ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. ప్రశాంతంగా నిద్రపోవాలని పేర్కొన్నారు.



ప్రజాఫ్రంట్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నగర అధ్యక్షుడు ముత్తయ్య, రాంబాబు

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యం : ముత్తయ్య

రాంనగర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తెలంగాణ ప్రజాఫ్రంట్ లక్ష్యం అని ఫ్రంట్ హైదరాబాద్ అధ్యక్షుడు బి.ముత్తయ్య పేర్కొన్నారు. ప్రజాఫ్రంట్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.రాంబాబు ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో గురువారం పార్టీ పతాకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేశామన్నారు. కార్యక్రమంలో కె.అంజయ్య, కె.సత్యనారాయణ, ఉదయ్ పాల్గొన్నారు.



ట్రోఫీతో డీడీ కాలనీలోని అకడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థులు

జాతీయ స్థాయి మెగా పోటీల్లో అకడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాంనగర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఢిల్లీలో జరిగిన 12వ జాతీయ స్థాయి మెగా పోటీల్లో పాల్గొన్న నగరంలోని డీడీకాలనీలోని అకడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థులు 40 క్యాటగిరిలోని వివిధ పోటీల్లో పాల్గొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. దేశవ్యాప్తంగా 60 పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొనగా డీడీ కాలనీలోని అకడమిక్ హైట్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ రూపారెడ్డి, ప్రిన్సిపాల్ సులక్షణ, ఆపరేషన్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డిలు ప్రశంసించారు. విద్యతోపాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు.



పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్‌భవన్‌కు అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, సిద్ధార్థ ముదిరాజ్, అతీఖ్ పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బస్సు దిగుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు



బస్సుచార్జీలు తగ్గించాలని నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు వి సుధాకర్‌గుప్తా, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రాకేష్, శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

పెంచిన బస్‌చార్జీలను తగ్గించాలని బీఆర్ఎస్ చలో బస్‌భవన్

- పోలీసుల అష్టదిగ్బంధంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, బస్‌భవన్ పరిసరాలు
- సినిమా థియేటర్లు, వ్యాపార సంస్థల మూసివేత
- బస్సులో ప్రయాణించి నిరసన తెలిపిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



రాంనగర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్‌ముదిరాజ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన వారాసిగూడ పోలీసులు



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బందోబస్తులో పాల్గొన్న డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ రమేష్‌కుమార్



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబుయాదవ్‌ను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

రాంనగర్/కవాడిగూడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పెంచిన బస్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ చేపట్టిన చలో బస్‌భవన్ ముట్టడి కార్యక్రమంతో బస్‌భవన్‌ను పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. బస్‌భవన్ వద్దకు ఎవరు రాకుండా ఆర్టీసీ క్రాస్‌రోడ్డు నుంచి వీఎస్‌టీకి వెళ్లే మార్గాన్ని పూర్తిగా మూసివేసి నాలుగు అంచెల పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఉన్న పలు సినిమా థియేటర్లు, హోటళ్ల వ్యాపార సంస్థలను పోలీసులు మూసివేయించారు. అదేవిధంగా విద్యానగర్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డుకు వచ్చే మార్గాన్ని మూసివేసి వీఎస్‌టీ జంక్షన్‌లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎవరిని బస్‌భవన్ వైపు అనుమతించలేదు. అదేవిధంగా రిసాలడ్డ నుంచి బస్‌భవన్‌కు వచ్చే మార్గాన్ని కూడా మూసివేసి వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. బాగ్‌లింగంపల్లి నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డుకు వచ్చే దారులను మూసివేశారు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది లు పడ్డారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రాకపోకలు నిలిపివేశారు. బీఆర్ఎస్ నేతలు వచ్చి ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చి వెళ్లిన తర్వాత ఈ ప్రాంతాల్లో రాకపోకలు నిలిపివేశారు. ఈ పోలీసు బందోబస్తులో సెంట్రల్ జోన్ డీసీపీ కె. శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్‌కుమార్, చిక్కడపల్లి ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, గాంధీనగర్ ఏసీపీ ఎ యాదగిరి, సీఐలు రాజునాయక్, ఎండి అంజద్‌అలీ, డీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది, వందలాదిమంది పోలీసులు పలు కూడళ్లలో భారీ బందోబస్తు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఎమ్మెల్యే గోపాల్ నిరసన

పెంచిన బస్‌చార్జీలను నిరసిస్తూ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్ ఐటీఐ బస్టాపులో బస్ ఎక్కి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బస్సు దిగారు. అనంతరం నియోజకవర్గం నాయకులు ముఠా జైసింహ డివిజన్ అధ్యక్షులు, నగర నాయకులు కార్యకర్తలతో కలిసి పెంచిన చార్జీలు తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు అరెస్ట్

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలను అంబర్‌పేటలో పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల అరెస్ట్ అన్యాయమని ఎమ్మెల్యే కాలేరు ఖండించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్‌ముదిరాజ్ హౌస్ అరెస్ట్

చలో బస్‌భవన్ నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం నాగేష్ ముదిరాజ్‌ను రాంనగర్‌లోని ఆయన నివాసంలో వారాసిగూడ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన చార్జీలను తగ్గించాలని ప్రశ్నించే నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు.

ఎమ్మెల్యేల తనయుల హల్‌చల్..

చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు ముఠా జైసింహ, మాజీమంత్రి తలసాని తనయుడు తలసాని సాయికిరణ్, మాజీమంత్రి పద్మారావు తనయుడు రామేశ్వర్‌గౌడ్‌లు తమ అనుచరులతో తరలివచ్చి బస్‌భవన్ ముట్టడికి యత్నించారు. అయితే పోలీసులు వారిని బస్‌భవన్ వరకు అనుమతించి లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు వారికి మధ్య తోపులాట జరిగింది. పోలీసుల తీరును వారు తీవ్రంగా ఖండించారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన, అరెస్టులు

చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నగర నలుమూలల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బస్‌భవన్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు వి సుధాకర్‌గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రోషం బాలు, రవియాదవ్, డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, రాకేష్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్యాంయాదవ్, నేత శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, వాడపల్లి మాధవ్, రాజశేఖర్‌గౌడ్, దీనదయాల్‌రెడ్డి, శివముదిరాజ్, రాజుయాదవ్, శ్రీధర్‌రెడ్డి, పూస గోరక్‌నాథ్, మేడి సత్యనారాయణ, శ్రీకాంత్ ధర్నా నిర్వహించారు.

ముషీరాబాద్: బస్‌చార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపులో భాగంగా బస్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ సారథ్యంలో భోలక్‌పూర్, ముషీరాబాద్ నేతలు బస్సులో తరలివెళ్లారు. బస్‌భవన్ ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ బస్‌చార్జీలు పెంచడం వలన పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడిందని అన్నారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పెంచిన బస్‌చార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబుయాదవ్‌ను, ఇతర నేతలను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బింగి నవీన్, శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.



చలో బస్‌భవన్ ముట్టడికి తరలివస్తున్న ఎమ్మెల్యేల తనయులు ముఠా జైసింహ, తలసాని సాయికిరణ్, తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్



బస్‌భవన్ ముట్టడిలో పాల్గొన్న బీఆర్ఎస్ కవాడిగూడ నేతలు రాజశేఖర్ గౌడ్, దీన్‌దయాల్‌రెడ్డి, రాజుయాదవ్, శివముదిరాజ్ తదితరులు

42శాతం రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు మోసం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, ఎర్ర సత్యనారాయణ తదితరులు

రాంనగర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ గురువారం విద్యానగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 79 ఏళ్లుగా బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తాజాగా కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు జరగాలంటే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టాలన్నారు. గతంలో తమిళనాడు సీఎం కూడా దీక్ష చేశారని గుర్తుచేశారు. డిమాండ్ల సాధన కోసం ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నందగోపాల్, వంశీకృష్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీచార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీజీఎస్ ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇచ్చే కార్యక్రమానికి వెళ్లకుండా పార్టీ రాష్ట్ర యువనేత ముఠా జైసింహను, కార్యకర్తలను గాంధీనగర్ డివిజన్ ఆంధ్రకేఫ్ వద్దనున్న ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను తగ్గించాలని చలో బస్‌భవన్ కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, నాయకులు లక్ష్మణ్, శివగణేష్, మహేందర్, మురారీలను కాచిగూడ పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ల్యాప్‌టాప్ అపహరణ

బర్కత్‌పుర, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ల్యాప్‌టాప్ బ్యాగును దొంగ లాక్కొని పారిపోయిన సంఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరానికి చెందిన పూర్ణిమ ప్రియాంక నాయుడు(24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆమె కాచిగూడకు రావడానికి విశాఖ మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద ప్రియాంకనాయుడు తలకిందపెట్టుకున్న ల్యాప్‌టాప్ బ్యాగును దొంగ లాక్కొని పారిపోయాడు. గురువారం ఆమె కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేద విద్యార్థులకు ఉచిత వసతి

- ఈ నెల 12న వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు



మాట్లాడుతున్న పి.రామకృష్ణ, అరుణ్‌కుమార్ సింగ్, రాంచంద్రన్, రమాదేవి, మహిపాల్‌రెడ్డి

నల్లకుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నిరుపేద విద్యార్థులకు శ్రీలక్ష్మీవెంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో ఉచిత వసతి కల్పించనున్నట్లు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ పి.రామకృష్ణ తెలిపారు. గురువారం నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుకోవాలనే పట్టుదల ఉన్న గ్రామీణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహంలో నివాసం, భోజనం ఏర్పాటుతో పాటు బస్‌పాస్ తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నామన్నారు. నగరం, శివారు ప్రాంతాలైన సుచిత్ర క్రాస్‌రోడ్స్, జీడిమెట్ల, లంగర్‌హౌజ్, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు. తల్లి, తండ్రులు కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొఫెషనల్ కోర్సులు, గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసిస్తున్న వారికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్ల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 12వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఇతర వివరాల కోసం 9550472190 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్టీ సభ్యులు అరుణ్‌కుమార్‌సింగ్, కె.రాంచంద్రన్, ఎస్.రమాదేవి, చిరంజీవరావు, వీ.వీ.కే.ప్రసాద్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్లాబ్ నాలా పనులు పూర్తిచేయాలి



డీఎంసీ మారుతిదివాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ నేతలు

నల్లకుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్‌లోని పాతరామాలయం వీధిలో పెండింగ్‌లో ఉన్న స్లాబ్ నాలా పనులు పూర్తి చేయాలని అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్‌కు నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ నేతలు గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయుడు, కోశాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు భవానీశంకరం, నిర్వహణ కార్యదర్శి కె.వీరయ్య, సహాయ కార్యదర్శి రమణలు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పాతరామాలయం వీధిలో ఈ నాలాలో వరదనీరు పొంగిపొర్లడంతో ఈ ప్రాంతంలోని ఇళ్లలోకి వరదనీరు చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వర్షం వస్తే చాలు స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పెద్ద నాలాలో చిన్న పైపులు వేస్తే పెద్ద ఎత్తున ప్లాస్టిక్ థర్మకోల్, చెత్త, చెదారం నిండిపోవడంతో వరదనీరు సరిపోక తిరిగి వెనక్కివస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంతాన్ని నల్లకుంట కార్పొరేటర్ యాకర.అమృత, జీహెచ్‌ఎంసీ అధికారులు సందర్శించిన ప్రతిసారి పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. కానీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా నల్లకుంట పాత రామాలయం వీధి నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు స్లాబ్ నాలా శాశ్వత పరిష్కారం కోసం పెద్ద సైజు ఐరన్ జాలీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఇందుకు స్పందించిన డీఎంసీ మారుతిదివాకర్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారన్నారు.



మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి

హైకోర్టు స్టే పై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి

బర్కత్‌పుర, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించిన 42శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 9పై హైకోర్టు ఇచ్చిన స్టే పై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టే బీసీ సమాజాన్ని తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత హైకోర్టు స్టే విధించటం అన్యాయం అన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లను సాధించుకోవడానికి ఒకవైపు న్యాయపోరాటం మరోవైపు ప్రజా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. బీసీల ఐక్యతతోనే 42శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని అన్నారు.

బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు : నవీన్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు బింగి నవీన్

ముషీరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీసీ రిజర్వేషన్ల అంశంపై హడావిడి చేయ డం వల్లే బీసీలకు అన్యాయం జరిగిందని పద్మశాలీ సంఘం రాష్ట్ర కోశాధికారి, బీఆర్ఎస్ భోలక్‌పూర్ సీనియర్ నాయకుడు బింగి నవీన్ ఆరోపించారు. గురువారం భోలక్‌పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అందువల్లే హైకోర్టు రిజర్వేషన్లను అడ్డుకున్నదని ఆరోపించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బడుగు బలహీన వర్గాలు తగిన గుణపాఠం చెబుతాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను తప్పుదోవపట్టించేందుకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పేరుతో రాజకీయం చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగేలా కృషిచేయాలని డిమాండ్ చేశారు.

కోర్టు తీర్పు నిరాశపర్చింది : టీజేఎస్

చిక్కడపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్‌లపై కోర్టు తీర్పు నిరాశపర్చిందని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లో మాట్లాడారు. కేసులో ఇంప్లీడ్ కావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం కోరితే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తప్ప ఒక్కరు కూడా ఇంప్లీడ్ కాలేదన్నారు. బీసీల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఎంత చిత్తశుద్ధి ఉన్నదో దీంతో తెలుస్తుందన్నారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్ వేయడం బీసీలను తీవ్రంగా నిరాశపర్చిందన్నారు. చాలా బాధించిందన్నారు.

బీసీలకు మరోసారి అన్యాయం : శ్రీనివాస్

రాంనగర్ : బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు మరోసారి అన్యాయం జరిగిందని ము షీరాబాద్ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు నేత శ్రీనివాస్ పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన 42శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్‌లో చట్టం తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. బీసీలందరూ ఐక్యంగా ఉండి తమ వాటాను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.